క్లుప్తంగా

కేయూ ఇన్‌చార్జ్ ఫైనాన్స్ ఆఫీసర్‌గా బాధ్యతల స్వీకరణ



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ ఫైనాన్స్ ఆఫీసర్‌గా డాక్టర్ మహ్మద్ హబీబుద్దీన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం నుంచి బాధ్యతలు స్వీకరించారు.

సీపీఐ జిల్లా కార్యదర్శిగా షేక్‌బాష్‌మియా



ఖిలా వరంగల్: సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శిగా షేక్ బాష్‌మియా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండు రోజుల పాటు జరిగిన పార్టీ జిల్లా మహాసభల్లో జిల్లా కార్యదర్శిగా షేక్ బాష్‌మియాను సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి మేకల రవి సమక్షంలో శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆర్టీఐ ఫోరం జిల్లా కోఆర్డినేటర్‌గా వెంకట్



హసన్‌పర్తి: ఆర్టీఐ (సమాచార హక్కు చట్టం) ఫోరం హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా నగరంలోని నిరూప్‌నగర్ తండాకు చెందిన మాలోతు వెంకట్ నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ ఆర్టీఐ ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు విమల్‌రాజ్ చక్రి శుక్రవారం ప్రకటించారు.

నేడు లయన్స్ నేతల ప్రమాణ స్వీకారం

మడికొండ: మడికొండ శివారు ధర్మసాగర్ రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో 320ఎఫ్ అంతర్జాతీయ లయన్స్ జిల్లా కేబినెట్ నాయకుల ప్రమాణ స్వీకారోత్సవం శనివారం సాయంత్రం జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గవర్నర్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య ఆనవాయితీ ప్రకారం అమెరికాలో ప్రమాణ స్వీకారం చేశారని, ఉప గవర్నర్లుగా ఎస్.సుధాకర్‌రెడ్డి, పుట్ట హరికిషన్ రెడ్డితో పాటు జిల్లా కేబినెట్, వివిధ పదవులకు ఎన్నికైన నాయకులు ప్రమాణ స్వీకారం చేస్తారని పేర్కొన్నారు.

రేపు పద్మశాలి వధూవరుల వివాహ పరిచయ వేదిక


రామన్నపేట: తెలంగాణ రాష్ట్ర పద్మశాలి ఉద్యోగుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో పోచమ్మమైదాన్ సమీపంలోని కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ భవనంలో ఆదివారం 9వ రాష్ట్ర పద్మశాలి వధూవరుల వివాహ పరిచయ వేదిక నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు కోడం రవిప్రకాశ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం భీమారం పాఠశాల విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన సివిల్ ఇంజనీర్ మార్క సురేష్, మార్క నవత సహకారంతో బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ మండల విద్యాశాఖ అధికారి ఎ.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బైరాన్‌పల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుమారస్వామి, ఉపాధ్యాయులు శ్రీదేవి, శ్రీధర్, సరోజన, సల్మాసుల్తాన, మస్రత్ బేగం తదితరులు పాల్గొన్నారు.

కొండచిలువ పట్టివేత



న్యూశాయంపేట: నగరంలోని మడికొండ మెట్టుగుట్ట కమాన్ వద్ద జనావాసాల మధ్య శుక్రవారం సాయంత్రం తచ్చాడుతున్న ఓ కొండచిలువను కాకతీయ జువాలాజికల్ పార్కు రెస్క్యూ టీం సభ్యులు పట్టుకున్నారు. స్థానికుల సమాచారం మేరకు జూ ఇన్‌చార్జ్ ఫారెస్ట్ రేంజ్ అధికారి మయూరి టీం సభ్యులు ఇ.స్వామి, ఎం.స్వామి అక్కడికి చేరుకుని కొండచిలువను జూపార్కుకు తరలించారు.

నేటితో ముగియనున్న క్యాంపు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ క్రీడా మైదానంలో ఎన్‌సీసీ పదో తెలంగాణ బెటాలియన్ వరంగల్ గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్యాంపు శనివారం ముగియనుంది. న్యూఢిల్లీలో వచ్చే ఏడాది జనవరి 26న రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనే కేడెట్లకు శిక్షణ ఇస్తున్నామని క్యాంపు కమాండెంట్ ఎస్‌ఎస్ రామదురై శుక్రవారం తెలిపారు. క్యాంపు ఆడమ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రవి సునారే, కెప్టెన్ సతీష్, కెప్టెన్ డాక్టర్ సదానందం, సుబేదారి మేజర్ రామ్‌సింగ్ పాల్గొన్నారు.

పంట కాల్వ కబ్జా

- తమ వెంచర్‌లో కలుపుకున్న రియల్టర్లు
- ముంపునకు గురవుతున్న సమీపంలోని పంట పొలాలు
- అధికారులకు ఫిర్యాదు చేసిన బాధిత రైతులు



కాల్వను కబ్జా చేసి ఏర్పాటు చేసిన వెంచర్



ముంపునకు గురైన పంట పొలాలు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం జయగిరి గ్రామ శివారులోని కొంతమంది రియల్టర్లు పంట కాల్వను ఆక్రమించారు. అంతటితో ఆగకుండా ఆ కాల్వను కబ్జా చేసి వెంచర్‌లో కలిపేసుకుని ప్లాట్లుగా విభజించారు. ప్రస్తుతం ఆ ప్లాట్లను అమ్మకానికి పెట్టారు. జయగిరి గ్రామంలోని సర్వే నంబర్ 66/ఎ, 66/ఎ/1/1, 67/ఎ/1లో ఎకరం భూమిని కొంతమంది రియల్టర్లు కొనుగోలు చేసి 20ప్లాట్లుగా విభజించారు. ఖరీదు చేసిన భూమి పక్క నుంచి సుమారు ఆరు ఫీట్ల వరద కాల్వ ఉంది. అయితే, ఆ కాల్వను సైతం రియల్టర్లు పూడ్చి కబ్జా చేసి ప్లాట్లుగా విభజించారు. పంట కాల్వ పూడి సుమారు మూడు మీటర్ల ఎత్తు మేర మొరంతో చదును చేశారు. దీంతో చెరువు నుంచి వచ్చే వరద కిందికి వెళ్లకపోవడంతో పంటపొలాలు ముంపునకు గురవుతున్నాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులకు ఫిర్యాదు

పంట కాల్వను పూడ్చి వేయడం వల్ల వరద నీరు కిందికి వెళ్లకపోవడంతో పంటపొలాలు ముంపునకు గురవుతున్నాయని రైతులు తెలిపారు. ఈ మేరకు రెవెన్యూతో పాటు నీటి పారుదల శాఖ అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. కబ్జాదారులపై చర్య తీసుకోవాలని పేర్కొన్నారు.

ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు



యూనిఫాం అందజేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

హసన్‌పర్తి: ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, అర్హతగల ఆటో డ్రైవర్లకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తానని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. ప్రపంచ ఆటో కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని 65వ డివిజన్‌లోని చింతగట్టు, మునిపల్లి అడ్డాల వద్ద ఆటో కార్మికులకు యూనిఫాంలను శుక్రవారం అందించారు. కాంగ్రెస్ నాయకుడు ఏరుకొండ శ్రీనివాస్ తన సొంత ఖర్చుతో చేపట్టిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆటో కార్మికుల ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని గుర్తుచేశారు. కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్ నర్సింహారెడ్డి, తాడు రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గుడిమళ్ల రవికుమార్, పీఏసీఎస్ చైర్మన్ బిల్లా ఉదయ్‌కుమార్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కొంక హరిబాబు, గడ్డం శివరాం, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా మాజీ అధ్యక్షుడు వీసం సురేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తంగళ్లపల్లి తిరుపతి, మాజీ సర్పంచ్ శ్రీరాములు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- యాంటీ నార్కొటిక్ డీఎస్పీ రమేష్‌కుమార్



మాట్లాడుతున్న డీఎస్పీ రమేష్‌కుమార్

విద్యారణ్యపురి: మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని యాంటీ నార్కొటిక్ డీఎస్పీ రమేష్‌కుమార్ సూచించారు. హనుమకొండ వడ్డేపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ప్రహరీ క్లబ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎవరైనా మాదక ద్రవ్యాలు వినియోగించినా, విక్రయించినా వెంటనే 1908 నంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. డ్రగ్స్ వినియోగం వ్యక్తి మానసిక ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం చూపుతుందో సైక్రియాటిస్ట్ డాక్టర్ ప్రహసిత్ వివరించారు. జిల్లా విద్యాశాఖ కమ్యూనిటీ మొబిలైజింగ్ కోఆర్డినేటర్ బద్దం సుదర్శన్‌రెడ్డి, సీఐ శ్రీకాంత్, హెచ్‌ఎం కుంట రవికుమార్, ఉపాధ్యాయులు కందగట్ల సురేష్, నర్సింహారెడ్డి, ప్రత్యూష, కృష్ణవేణి, రాజగోపాలచారి, మోహన్‌రెడ్డి, విమలాబాయి, సరళ తదితరులు పాల్గొన్నారు.

మొరం తరలిస్తున్న టిప్పర్ సీజ్

మడికొండ: ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. మడికొండ పోలీసులు తరాలపల్లి గ్రామంలో శుక్రవారం ఉదయం పెట్రోలింగ్ చేస్తుండగా వారికి చూసి పారిపోవడానికి టిప్పర్ డ్రైవర్ ప్రయత్నించాడు. నిందితుడు అరూరి మహేష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై వివరించాడు.

ఉరేసుకొని వ్యక్తి బలవన్మరణం

ఖిలా వరంగల్: తాగుడుకు బానిసై చేసిన అప్పులు తీర్చేదారి లేక మనస్తాపంతో ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం రాత్రి కరీమాబాద్ నానామియా తోటలో చోటు చేసుకుంది. మిల్స్‌కాలనీ పోలీసుల కథనం ప్రకారం దాసు రవికాంత్ (42) టీస్టాల్ పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. తాగుడుకు బానిసై ఇటీవల భార్యకు విడాకులు ఇచ్చాడు. అప్పులు తీర్చే దారిలేక ఒంటరి తనంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి దాసు నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రమేష్ వివరించారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

కాజీపేట రూరల్: కాజీపేట జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఫాతిమానగర్ బ్రిడ్జి కింద ఇ–కేబిన్ రైలు పట్టాలపై పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు కాజీపేట జీఆర్పీ పోలీసులు శుక్రవారం తెలిపారు. కాజీపేట జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ రమణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం సుమారు 40 ఏళ్ల మృతుడి వివరాల కోసం కాజీపేట జీఆర్పీ పోలీస్‌స్టేషన్ లేదా 87126 58609, 94400 27342 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

అనిల్‌కుమార్‌కు సన్మానం

హన్మకొండ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఆదాయ పన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ ఎం.అనిల్ కుమార్‌ను రాష్ట్ర ట్యాక్స్ బార్ అసోసియేషన్ నాయకులు సన్మానించారు. హైదరాబాద్‌లోని కార్యాలయంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, వరంగల్‌కు చెందిన చార్టర్డ్ అకౌంటెంట్ పీవీ.నారాయణ రావు, టాక్స్ బార్ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం జ్ఞాపిక అందించి శుభాకాంక్షలు తెలిపారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే, పక్కన మేయర్, కమిషనర్

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

రామన్నపేట: పరకాల నియోజకవర్గ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగిరంగా పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆదేశించారు. జీడబ్ల్యూఎంసీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి నియోజకవర్గానికి సంబంధించిన 15, 16, 17వ డివిజన్లలో అభివృద్ధి పనుల పురోగతి, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీరు, విద్యుత్ సరఫరాకు సంబంధించిన పలు అంశాలపై అధికారులతో శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్, స్టాంప్ డ్యూటీ నిధులతో మూడు డివిజన్లలో రూ.7.27 కోట్లతో 32 అభివృద్ధి పనులు చేపట్టగా, ఇందులో సుమారు రూ.కోటి వ్యయంతో చేపట్టిన 18 పనులు పూర్తయ్యాయని అన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ ఎస్‌ఈ మహేందర్, అదనపు కమిషనర్ జోనా, ఎంహెచ్‌ఓ డాక్టర్ రాజారెడ్డి, ఇన్‌చార్జ్ ఎస్‌ఈ, సీపీలు మహేందర్, రవీందర్, రాధాకర్, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి పాల్గొన్నారు.

ఆసియా తైక్వాండో పోటీల్లో ప్రతిభ



పతకాలతో తైక్వాండో క్రీడాకారులు, కోచ్

వరంగల్ స్పోర్ట్స్: జులై 25 నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు మలేషియాలో నిర్వహించిన 10వ ఆసియా పారా తైక్వాండో పూమ్సే, క్యోరూగి చాంపియన్ షిప్‌లో హనుమకొండలోని పైడిపల్లికి చెందిన ఎల్లావుల గౌతమ్‌యాదవ్ పాల్గొని వెండి పతకం సాధించాడు. పీ –51 మేల్ స్పోర్ట్స్ క్లాస్ విభాగంలో బహ్రెయిన్ క్రీడాకారుడితో తలపడి వెండి పతకం సాధించగా, పీ –52 కేటగిరీలో సింగపూర్ క్రీడాకారుడితో కుక్కల శివ ఆడి సిల్వర్, పీ –52 విభాగంలో ఇరాక్ క్రీడాకారుడితో పోటీపడి ఎం.కృష్ణవాణి బ్రాంజ్ మెడల్ సాధించారు. భారత్ తరఫున బరిలోకి దిగిన గౌతమ్, శివ, కృష్ణవాణి పతకాలు సాధించడం దేశానికి గర్వకారణమని కోచ్ గణేష్‌యాదవ్ కొనియాడారు. ఈ చాంపియన్‌షిప్‌లో భారత్ మొత్తం 6 గోల్డ్, 6 సిల్వర్, 4 బ్రాంజ్ మెడల్స్ సాధించడంతో ఓవరాల్‌గా మొదటి స్థానంలో, బెస్ట్ మేల్ టీంలో మొదటి స్థానం, బెస్ట్ ఫిమేల్ టీం రెండో స్థానంలో నిలిచిందని వివరించారు.

మాలేగావ్ కేసు తీర్పు సరికాదు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్‌రావు

న్యూశాయంపేట: మాలేగావ్ పేలుళ్ల కేసులో వెలువడిన తీర్పు సరికాదని, అది న్యాయాన్ని అపహాస్యం చేయడమేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. హనుమకొండలోని సుందరయ్య భవన్‌లో పార్టీ విస్తృత సమావేశం బి.చక్రపాణి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా పోతినేని మాట్లాడుతూ మాలేగావ్ పేలుళ్లలో ఆరుగురు అమాయకులు మరణించగా, సుమారు వంద మందికిపైగా క్షతగాత్రులయ్యారని తెలిపారు. సాక్ష్యాధారాలు లేవని, విధానపరమైన లోపాలు ఉన్నాయన్న సాకుతో బీజేపీ మాజీ ఎంపీ ప్రగ్యాసింగ్ ఠాగూర్, తదితరులను నిర్దోషులుగా విడిచిపెట్టడాన్ని ఆయన తప్పుబట్టారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు చుక్కయ్య, ఉప్పలయ్య, రమేష్, వెంకట్, వీరన్న, రాములు, తిరుపతి, లింగయ్య, సంపత్, దీప, భానునాయక్, రవి, రజిత పాల్గొన్నారు.

సైకాలజిస్టులు, కౌన్సిలర్లను నియమించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న బాధ్యులు

హన్మకొండ చౌరస్తా: ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో సైకాలజిస్టులు, కౌన్సిలర్లను ఏర్పాటు చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని తెలంగాణ సైకాలజిస్టుల అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోని అన్ని విద్యాసంస్థల్లో సైకాలజిస్టులు, కౌన్సిలర్లను నియమించాలని 2021లో పార్లమెంట్‌లో చట్టం చేశారని గుర్తు చేశారు. ఇటీవల విద్యార్థుల ఆత్మహత్యలను నివారించేందుకు సుప్రీంకోర్టు 15 మార్గదర్శకాలను విడుదల చేసిందని పేర్కొన్నారు. అందులో కౌన్సిలర్లను ఏర్పాటు చేయాలని సూచించిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ హనుమకొండ ప్రెసిడెంట్ గంగిశెట్టి శ్రీవిద్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మురళీధర్, జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ శివుడు, జిల్లా కార్యదర్శి కళ్యాణి, సునీత, సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి సీపీఐ పోరాటం




సమావేశంలో మాట్లాడుతున్న మేకల రవి

- పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేకల రవి

ఖిలా వరంగల్: వరంగల్ జిల్లా సమగ్రాభివృద్ధికి సీపీఐ పోరాటం చేస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేకల రవి తెలిపారు. ఈ మేరకు వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో పార్టీ జిల్లా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలకుల నిర్లక్ష్యం వల్ల జిల్లా వెనుకబడిందని వాపోయారు. రెండు రోజులపాటు జిల్లా మహాసభలు నిర్వహించగా, 316 మంది ప్రతినిధులు పాల్గొని జిల్లా సమగ్రాభివృద్ధి కోసం భవిష్యత్‌లో చేయాల్సిన ఉద్యమాలపై సమగ్రంగా చర్చించి 17 తీర్మానాలను ఆమోదించినట్లు రవి వివరించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి షేక్ బాష్‌మియా, నాయకులు పనాస ప్రసాద్, దండు లక్ష్మణ్, బుస్స రవీందర్, గన్నారపు రమేష్, గుండె బద్రి, తాళ్లపల్లి రాయల, ఎలేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీ నెరవేర్చకుంటే పోరాటమే



సమావేశంలో మాట్లాడుతున్న సోమన్న

హసన్‌పర్తి: కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా వికలాంగులు, వితంతువుల, వృద్ధులు, బీడీ కార్మికులకు పెంచిన పింఛన్ ఇవ్వకుంటే పోరాటాలు చేస్తామని ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా ఇన్‌చార్జ్ కందుకూరి సోమన్న హెచ్చరించారు. చింతగట్టు క్యాంపు సమీపంలోని ఓ గార్డెన్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ముఖ్యకార్యకర్తల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సుమారు 20నెలలు గడుస్తున్నా ఒక్క పైసా కూడా పింఛన్ పెంచలేదన్నారు. ఈ నెల 7న వికలాంగుల చేయూత పెన్షన్‌దారుల మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజారపు భిక్షపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సుకుమార్, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సింగారపు స్వామి, నాయకులు ఆరెపల్లి పవన్, మేకల రమేష్, ప్రభాకర్, సందెల రాజు, మొగిలి, ఆనందం, నమిండ్ల సూర్యం, సాంబయ్య, యాదగిరి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఆర్టీఏ ఎదుట లారీ యజమానుల ధర్నా

హసన్‌పర్తి: చింతగట్టు క్యాంపు ఆవరణలోని ఆర్టీఏ ప్రధాన కార్యాలయం ఎదుట ఇసుక లారీల యజమానుల సంఘం నాయకులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీఏ, మైనింగ్ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గురువారం రాత్రి విజిలెన్స్, మైనింగ్, కమర్షల్ ట్యాక్స్, ఆర్టీఏ సంయుక్త ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి పరిమితికి మించి ఇసుక తీసుకెళ్తున్న సుమారు 12లారీలను పట్టుకున్నారు. ఈ విషయపై ఇసుక లారీల సంఘం ఆధ్వర్యంలో చింతగట్టు క్యాంపులోని ఆర్టీఏ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు యాదయ్య మాట్లాడుతూ ఇసుక రీచుల్లో నిర్వహిస్తున్న కాంటాల్లో హెచ్చుతగ్గులు రావడంతో అధికారులు దాడులు నిర్వహించారని, కాంటాల్లో హెచ్చుతగ్గులకు కారణం టీజీఎండీసీ కార్పొరేషన్ సంస్థ, సదరు కాంట్రాక్టర్లే బాధ్యత వహించాలని పేర్కొన్నారు. అసోసియేషన్ నాయకులు శ్రీనివాస్ నాయుడు, జంగారెడ్డి, సత్తయ్య, శంకర్, శశి, లింస్వామి పాల్గొన్నారు.

'అమరుల యాది'ని విజయవంతం చేయాలి

కాజీపేట: కల్లుగీత కార్మికుల హక్కుల కోసం పోరాడి అమరులైన వారిని గుర్తు చేసుకుంటూ గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు చేపట్టిన అమరుల యాదిలో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ కోరారు. కాజీపేట మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బొల్లగాని పుల్లయ్య వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం ప్రారంభమైన యాత్ర ఈనెల 18న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి రోజు ముగుస్తుందని అన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గౌని సాంబయ్య గౌడ్, జిల్లా గౌరవ సలహాదారుడు మోడెం రాజేందర్, నాగపురి రాజయ్య, పిల్లల కుమారస్వామి, గౌని ఫణీందర్ పాల్గొన్నారు.

సంఘం అభ్యున్నతికి కృషి చేయండి

హన్మకొండ చౌరస్తా: ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంగా ఏర్పాటైన శ్రీకామాక్ష విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మహిళా సంక్షేమ పరపతి సంఘం అభ్యున్నతికి డైరెక్టర్లు ఐక్యంగా కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘం ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు కోరారు. హనుమకొండ కాపువాడలో సంఘం డైరెక్టర్ల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షురాలు గుగ్గిళ్ల శశిరేఖ, ప్రధాన కార్యదర్శి రుద్రోజు భవాని, సహాయ కార్యదర్శి పెండోట రమాదేవి మాట్లాడుతూ సంఘంలోని 206 మంది సభ్యులు ప్రతినెలా విధిగా 20వ తేదీన డబ్బులు చెల్లించాలని సూచించారు. సమావేశంలో డైరెక్టర్ దుద్దుకూరి పుష్పలీల, విశ్వబ్రాహ్మణ మాతృ సంఘం ఉపాధ్యక్షుడు పెండోట సురేష్, చెంగెళ్ల హేమలత, కొక్కొండ అమల తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో భాగస్వాములు కావాలి

కాజీపేట: అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములైనప్పుడే పనులు నాణ్యతగా ఉంటాయని కార్పొరేటర్ విజయశ్రీ అన్నారు. కాజీపేట 63వ డివిజన్ తిలక్‌నగర్ కాలనీలో రూ.25 లక్షల వ్యయంతో చేపట్టిన సైడ్ డ్రెయినేజీ పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధికి ఎప్పటికప్పుడు నిధులు మంజూరు చేస్తూ కాలనీల అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

జాతీయ ఓబీసీ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

హన్మకొండ చౌరస్తా: ఈ నెల 7వ తేదీన గోవాలో నిర్వహించనున్న జాతీయ ఓబీసీ మహాసభల వాల్ పోస్టర్లను ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి, కేఆర్.నాగరాజు, మేయర్ సుధారాణి చేతుల మీదుగా సంఘం నాయకులు ఆవిష్కరించారు. హనుమకొండలోని జేఎన్ స్టేడియంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, మల్లయ్య, యాదగిరి, నాగరాజు, శోభారాణి, మహేందర్, అరుణ, మానస తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత దీక్షల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

కేయూ క్యాంపస్: బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని, పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదం తెలపాలనే డిమాండ్‌తో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఈనెల 4, 5, 6వ తేదీల్లో హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద చేపట్టనున్న 72గంటల దీక్షలను విజయవంతం చేయాలని జాగృతి రాష్ట్ర నాయకుడు నలమాస శ్రీకాంత్ గౌడ్, బాధ్యుడు డాక్టర్ పర్లపెల్లి శ్రీశైలం పిలుపునిచ్చారు. ఈ మేరకు కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద దీక్షల వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్రవణ్, శ్రీధర్, రాకేష్, జన్ను సంతోష్, ఉదయ్, భరత్, సుతేజ్, తాండ్ర భాస్కర్, కుసుమ రాజు, గణిపాక చరణ్, మధు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు సన్మానం

మడికొండ: ఆగస్టు 1వ తేదీన ఆటో డ్రైవర్ల దినోత్సవం సందర్భంగా పలువురు ఆటో డ్రైవర్లకు శాలువాలు కప్పి మడికొండ హెడ్ కానిస్టేబుల్, గ్రామ పోలీసు అధికారి జయరాజు శుక్రవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు దార సూరి, బరిగల కృష్ణమూర్తి, గోపనబోయిన రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన వారికి సన్మానం



సరళాదేవిని సన్మానిస్తున్న ఉద్యోగినులు



మోహన్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ బాధ్యులు

కేయూ క్యాంపస్: ఉద్యోగ విరమణ పొందిన కేయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్ సరళాదేవిని యూనివర్సిటీలోని మహిళా ఉద్యోగినులు గెస్ట్‌హౌస్ వద్ద శుక్రవారం సన్మానించారు. అలాగే, బుక్ కీపర్ కమల, ల్యాబ్ అటెండర్ శోభారాణిని సన్మానించారు. కేయూ ఎన్‌జీఓ సంఘం మహిళా ప్రతినిధి కృష్ణవేణి, నాల్గో తరగతి ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధి మల్లికాంబ, శ్రీలతాదేవి, శ్రీలత, హేమారాణి, సృజన, కవిత, నర్మద పాల్గొన్నారు.

విరమణ పొందిన మోహన్‌కు..

రామన్నపేట: వైద్య, ఆరోగ్య శాఖలో వివిధ హోదాల్లో పనిచేసి ఆఫీస్ సూపరింటెండెంట్‌గా ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన దామెర మోహన్‌ను సీకేఎం గ్రౌండ్ ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు చింతం సారంగపాణి, కార్యదర్శి తాడిపత్రి రఘునాథరావు, గౌరవ అధ్యక్షుడు సదానందం పాల్గొన్నారు.

ప్రతిభ కనబర్చిన కేడెట్లకు బహుమతులు



కేయూ క్యాంపస్: కేయూలో నిర్వహించిన ఎన్‌సీసీ శిబిరంలో ప్రతిభ కనబర్చిన 4వ బెటాలియన్ ఎయిర్ స్క్వాడ్రన్ కేడెట్లకు బహుమతులు ప్రదానం చేశారు. ఎయిర్ మోడలింగ్, స్కీట్ షూటింగ్ విభాగాల్లో బహుమతులు సాధించిన ఎన్‌సీసీ కేడెట్లను కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి అభినందించారు. తెలంగాణ, ఏపీ డైరెక్టరేట్‌కు చెందిన డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమాండర్ నరసింగ్ శైలని ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు ట్రోఫీలు, పురస్కారాలు అందజేశారు. శిబిరంలో 10వ బెటాలియన్ క్యాంప్ కమాండింగ్ ఆఫీసర్ ఎస్‌ఎస్ రామదురై, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రవి సునారే, వింగ్ కమాండర్ ఆశిష్ భాస్కర్ ధనకే, వినోద్‌కుమార్, సూర్యవంశీ, ప్రకాశ్, నంబియార్, ఆర్‌ఎస్ మోహంతి, అజిత్, ప్రవీణ్‌బాబు, ఆర్‌జే ఆత్రే పాల్గొన్నారు.

సమాచార సేకరణకు ఆర్టీఐ ఓ అస్త్రం

హన్మకొండ అర్బన్: దేశంలోని పలు రకాల పరిపాలన విభాగాలకు సంబంధించిన అన్ని విషయాలను క్షుణ్ణంగా తెలుసుకునేందుకు పౌరులకు ఆర్టీఐ ఓ అస్త్రంగా ఉపయోగపడుతుందని తెలంగాణ ఆర్టీఐ ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు చిట్యాల విమలరాజ్ తెలిపారు. ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన ఫోరం ఉమ్మడి జిల్లా నేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2005లో రూపొందించిన ఆర్టీఐ చట్టం ద్వారా సామాన్య పౌరుడికి సైతం పరిపాలన విషయాలు తెలుసుకునే అవకాశం లభించిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కోఆర్డినేటర్ మాలోతు వెంకట్, ఉమ్మడి జిల్లా నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.